క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భిక్షపతినగర్, ఆర్‌టీఓ ఆఫీస్ పరిసరాలు, గోపాల్‌రెడ్డినగర్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శిల్పాపార్కు 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిల్పాపార్కు ప్రాంతం, మహర్షి విద్యామందిర్ స్కూల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మార్తాండనగర్ ఫీడర్ పరిధిలోని మార్తండనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మయూరినగర్, వికాస్ సబ్ స్టేషన్ పరిధుల్లో

మియాపూర్: మయూరినగర్, వికాస్ సబ్ స్టేషన్ పరిధిలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాంనరేష్ నగర్ ఓహెచ్ ఫీడర్‌లో శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, ఏఎస్‌రాజ్ నగర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, వెర్టెక్స్ ప్రైమ్ ప్రాంతాలలో, అదేవిధంగా 11కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రీయ విహార్, మయూరినగర్, ఎస్‌బిఐ బ్యాంక్ లైన్, కొలంబస్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు బంద్



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి కురిసిన వర్షానికి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీ చెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా వరద నీరు నిలిచింది. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను, గచ్చిబౌలి నుంచి తారానగర్ మీదుగా భెల్ చౌరస్తా వైపు వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించడంతో వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

రేపు శాంతిసరోవర్‌లో బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 24న బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'బియింగ్ లైక్ ఏ ఫ్లవర్'పేరుతో ఈ కార్యక్రమం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాగుతుంది. ఇందులో 9 నుంచి 14 ఏళ్లలోపు వయస్సు కలవారు పాల్గొనేందుకు అర్హులుగా గుర్తించారు. మరిన్ని వివరాలకు 040–23001234లో సంప్రదించవచ్చు.

పర్యావరణాన్ని కాపాడుదాం

మాదాపూర్: ప్లాస్టిక్‌ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మాదాపూర్ సీఐ తిరుపతి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు గణేశ్ నిమజ్జన ప్రదేశంలో శుక్రవారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ప్లాస్టిక్ వాడడం నియంత్రించాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌కి బదులు జూట్ బ్యాగులను, పేపర్ బ్యాగులను వాడాలని కోరారు. ప్లాస్టిక్‌ని నియంత్రించే విధంగా చేపట్టే కార్యక్రమాలు రేపటి తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. పలువురుకి గ్రీన్ ఇండియా చాలెంజ్ జ్యూట్ బ్యాగులను, పేపర్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవికిరణ్, ఎస్సై ఇక్బాల్, డీఐ వెంకట్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జ్యూట్ బ్యాగులు, పేపర్ బ్యాగులను పంపిణీ చేస్తున్న మాదాపూర్ సీఐ తిరుపతి తదితరులు

గణపయ్యా.. పూజలందుకోవయ్యా

శేరిలింగంపల్లి జోన్ బృందం: వాడవాడలా గణేషుడి నామస్మరణ మారు మ్రోగుతోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణేషుడిని దర్శించుకుంటున్నారు.

5వ రోజు భారీగా నిమజ్జనాలు..

వినాయక ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన శుక్రవారం భారీగా నిమజ్జనాలు సాగాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని గణేష్ నిమజ్జన కోనేర్ల వద్ద పెద్ద సంఖ్యలో గణనాథులు నిమజ్జనాలు జరిపారు. నిమజ్జనాలపై జీహెచ్ఎంసీ, ఇతర విభాగాల అధికారులు, పోలీసులు పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కోనేర్లలో ఎప్పటికప్పుడు వినాయకులు, ఇతర పూలు, పత్రి వంటి వాటిని కూడా తొలగించేందుకు ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి సమస్యలు తలెత్తడం లేదు.



శేరిలింగంపల్లి బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్స్‌లో.. ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



ఎన్టీఆర్‌కాలనీలో.. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా



చందానగర్‌లో.. కార్పొరేటర్ మంజులారెడ్డి



నానక్‌రాంగూడలో..

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ముందు శుక్రవారం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ డిమాండ్లు అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రెబ్బా రామారావు, బీఎంఎస్ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు రాజేశ్వరరావు, ఏఐటీయూసీ ఏసురత్నం, సీఐటీయూ వెంకటేష్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.24వేలకు తగ్గకుండా ఉండాలని డిమాండ్ చేశారు. ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్స్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్‌లకు రూ.30వేలకు తగ్గకుండా వేతనం అందించేలా చేయాలని కోరారు.

లింగసమానత్వాన్ని అమలు చేసేందుకు ముందుకురావాలి

రాయదుర్గం: లింగసమానత్వాన్ని తీసుకరావడంలో మారుతున్న ఆలోచనా విధానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలో 'లింగ–ఆధారిత హింస: పరిశోధన, అభ్యాసంపై ఇండో జర్మన్ అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను జాకీర్ హుస్సేన్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ లింగసమానత్వాన్ని అమలు చేసేందుకు ముందుకురావాలన్నారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ షీలా సూర్యనారాయణన్ మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళా సాధికారత, పురోగతిని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు హేకే పాంటెల్‌మాన్, మార్గెరిటా వాన్‌బ్రెంటావో, పార్థసారథి, క్రిస్టియన్ ష్వియెరెన్, డాక్టర్ సుబూర్‌బక్ష్, విభూతి సుఖమణి ప్రసంగించారు.



వర్క్‌షాప్‌లో వీసీ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ, జర్మనీ ప్రొఫెసర్లు

అందం..ఆత్మవిశ్వాసం



గచ్చిబౌలిలోని నేచురల్ ఫ్యామిలీ సెలూన్ ప్రారంభిస్తున్న సినీనటి కావ్య కల్యాణ్‌రామ్

గచ్చిబౌలి: అందం..ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుందని టాలివుడ్ నటి కావ్య కల్యాణ్‌రామ్ పేర్కొన్నారు. హెయిర్ అడ్ స్కిల్ కేర్‌లో పాన్ ఇండియా బ్రాండ్ అయిన నేచురల్ ఫ్యామిలీ సెలూన్‌ను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రి సమీపంలో తెలంగాణలో 90వ నేచురల్ సిగ్నేచర్ సెలూన్ ఫ్రాంచైజీ ఔట్‌లెట్‌ను సంస్థ వ్యవస్థాపకురాలు, సహ వ్యవస్థాపకురాలు వీణ, సికెకుమారవేల్‌తో కలిసి ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యూటీసెలూన్లు ప్రతిఒక్కరి లైఫ్ స్టైల్‌కు అనుగుణంగా మరింత అందంగా, ఆకర్షణీయంగా మారేందుకు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఫ్యాషన్‌గా ఉండటమే కాదు మరింత అందంగా కనిపంచేందుకు నేటి తరం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందుకు తగ్గ సేవలను ఈ సంస్థలో పొందవచ్చన్నారు. సహ వ్యవస్థాపకులు సికెకుమారవేల్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 70శాతం పైగా మహిళలు వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారన్నారు. వినియోగదారులకు ఉత్తమమైన బ్యూటీ సేవలను అందించడంలో నేచురల్స్ ఎంతో ముందుందున్నారు. ఈ కార్యక్రమంలో నేచురల్స్ సీఓఓ సీలా అరవింద్‌కుమార్, ఫ్రాంచైజీ భాగస్వామి హరిణ్యగొని పాల్గొన్నారు.

అన్ని తరాలకు ఆదర్శప్రాయుడు గురజాడ

రాయదుర్గం: రెండు శతాబ్దాల క్రితమే రాడికల్ ఫెమినిస్ట్ గురజాడ అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ గుండెమెడ నాగరాజు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు విభాగం, గురజాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు రెండవ రోజైన శుక్రవారం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురజాడను అయన సాహిత్యాన్ని స్మరించుకోవడమంటే గతాన్నీ వర్తమానాన్నీ భవిష్యత్‌ని చర్చించుకోవడమేనని, అది గురజాడ దార్శనికతకు నిదర్శనమన్నారు. గురజాడ అన్ని తరాలవారికి ఆదర్శప్రాయుడన్నారు. గురజాడ ఫౌండేషన్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు గురజాడ అరుణ మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు మా ముత్తాత కావడం మా జీవితంలో ఒక అదృష్టమని, ఆ వంశంలో పుట్టినందుకు తాము ఎంతో గర్వపడు తున్నామన్నారు. ఆయన మునిమనమడు గురజాడ రవీంద్రుడు మాట్లాడుతూ.. అసమ్మతి పత్రం చాలా విలువైనదని గురజాడ భావించేవారన్నారు. ఆచార్యులు ఎస్ ఈశ్వర్‌రెడ్డి, జేవీ రమణ, శ్రీపురంయజ్ఞశేఖర్, గోనానాయక్, పిల్లల మర్రి రాములు, డి విజయలక్ష్మి, బాణాల భుజంగరెడ్డి, భూక్య తిరుపతి, విజయకుమారి, రామనాథంనాయుడు, గోవిందరావు, ఖాసీమ్, పఠాన్‌ఖాన్, సుంకరగోపాల్ పాల్గొన్నారు.



హెచ్‌సీయూలో నిర్వహించిన గురజాడ సదస్సులో పాల్గొన్న అతిథులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం చీల్లపల్లికి చెందిన బాబు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు సునీల్, అనిల్, ఒక కుమార్తె అరుణ బాయ్ ఉన్నారు. చిన్న కుమారుడు అనిల్ 10 నెలల క్రితం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూరు గ్రామానికి చెందిన సవితతో వివాహం జరిగింది. వివాహం జరిగిన తరువాత అనిల్ కుటుంబం జీవనోపాధి కోసం శేరిలింగంపల్లిలో ఉంటున్నారు. అప్పటి నుంచి ఓ ప్రైవేట్ ఏజెన్సీలో పాల ప్యాకెట్ల డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. 21వ తేదీ గురువారం అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్ చేసి రమ్మన్నారు అని భార్య సవితకు తెలియజేసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఉదయం నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద వర్టెక్స్ నిర్మాణ సంస్థ వాచ్‌మెన్ చందానగర్ పోలీసులకు ఓ వ్యక్తి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడిఉన్నాడని తెలియజేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని గుర్తించారు. ఆ వ్యక్తి అనిల్ అని గుర్తించి అనంతరం అతని ఒంటిపై కూడా గాయాలు ఉన్నాయన్నారు. కరెంట్ షాక్ గురై ఉండవచ్చని కూడా అనుమానిస్తున్నారు. లేక ఎవరైన హత్య చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అనిల్ మృతదేహం

ఆలయ అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని శివానగర్‌లోని బసవేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. బసవేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం చుట్టూ ప్రహారీని నిర్మించేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, నాయకులు నర్సింహులు, మహేష్‌గౌడ్, నరేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ, పీహెచ్‌డీ అర్హత గల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 వ తేదీన వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంగ్లిష్–1, ఫిజికల్ డైరెక్టర్–1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9000049142, 8978684962ను సంప్రదించాలని కోరారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ క్లీన్ అండ్ గ్రీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహాదేవరెడ్డి, కల్పన ఉపేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, మహేందర్‌రెడ్డి, నల్ల మాధవరెడ్డి, కొండకల శ్రీనివాస్, కొల్లూరి యాదగిరి, చౌటకూరి మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాచెరు: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూరు, నందిగామ గ్రామాల్లో రూ.3,45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. అదే విధంగా పాటి గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టనున్న దర్గా ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాలు నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని తెలిపారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన వారికి 75 గజాల ఇళ్లస్థలం అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వైస్ ఎంపీపీ స్వప్న, సర్పంచులు ఉమావతిగోపాల్, శ్రీనివాస్, లక్ష్మణ్, ఎంపీటీసీలు నాగజ్యోతి లక్ష్మణ్, యాదగిరి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బిహార్ కనెక్ట్–2023 చేనేత హస్తకళా ఎగ్జిబిషన్ సందర్భంగా శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అమృత ఆర్ట్స్ అకాడమీ సాయిగీత శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఇందులో మూషిక వాహన, వినాయకకౌతం, రుక్మిణీ ప్రవేశ దరువు, అన్నమాచార్య కీర్తన, నారాయణీయం, కృష్ణశబ్దం, ధనశ్రీ తిల్లాన, మహాగణపతిం తదితర అంశాలను కళాకారులు అమృత, రోషిని, మీనాక్షి, రిత్విద, శాన్వి, ప్రణవి, మానస వీణ, చైత్ర, శ్రీనిక, శ్రీమోక్ష తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

శేరిలింగంపల్లి: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు 12వ రోజుకు చేరాయి. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నామన్నారు. తామంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ రాష్ట్రంలో మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు ఎం.రఘునాథ్‌యాదవ్, ఏఐటీయూసీ నాయకులు ఏసుదాసు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు నాగమణి, శ్రీలత, లక్ష్మీప్రవీణ, సువర్ణ, రూప, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకి చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు, యువకులు మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం వారికి బీఆర్ఎస్ కండువాను కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే గాంధీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అంతా బీఆర్ఎస్ వైపే మొగ్గుచూపుతుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులవుతున్నారన్నారు. ఇతర పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సైతం తమ పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, సహదేవ్, సాయికృష్ణ యాదవ్, ఆఫ్రోజ్, రాజు, వినయ్, వంశీ, అస్లాం, రాజు, నరేందర్, ఉపేందర్, వినోద్, రాజేశ్, బంటి, సోను, రాము, జైపాల్, హరికృష్ణ ఉన్నారు.

డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అనితా అగర్వాల్

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం డిజైర్ డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను పలువురు మోడల్స్‌తో కలిసి నిర్వాహకురాలు అనితా అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో వివాహాదిశుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌తో కూడిన వస్త్రాలు, పండుగల సందర్భంగా మహిళలకు చీరలు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సాంప్రదాయ వస్త్రాలు, నగలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటి ప్రియ ఇంటూరు, కృనికారాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ప్రారంభం

మాదాపూర్: కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం చిత్రకళాకారుడు అగాచార్య వేసిన చిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెటూరి వాతావరణంలో ఉండే మహిళల చిత్రాలను అద్భుతంగా గీశారని కొనియాడారు. ఈ ప్రదర్శన అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత అంజుపోద్దార్, ఎడిటర్, ఆర్ట్‌క్యూరేటర్ రత్నారావు శేఖర్, ఎస్ఆర్ ప్రైవేట్‌లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్వతీరెడ్డి, చిత్ర కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



చిత్రప్రదర్శనను చూస్తున్న డాక్టర్ లక్ష్మి తదితరులు

రూ.5.98 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో రూ.5.98 కోట్లతో సీసీ రోడ్ల పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్, ఆర్టీసీ కాలనీ, జనప్రియనగర్ కాలనీల్లో సుమారు రూ.1.29 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, గోకుల్ ప్లాట్స్, సిద్ధివినాయక్‌నగర్, జేఎన్‌టీయూ కాలనీలలో రూ.4.69 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో కాలనీలు అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పూజిత గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.